కథా నిలయం
6019
శ్రీకాకుళం

# మనకీ ఒక కారు

అప్పుడే వర్షంకురిసి వెలిసింది. వర్షంకురిసి వెలిసిన తర్వాత వచ్చే ఎండనేగా నీరెండ అంటారు. ఆ నీరెండలో శాంతా దేవి చెక్కులు తళతళ లాడుతున్నాయి. మల్లెలు వాళ్ళో పోసుకుని, వాటిగుండెల్లోకి సూదిగుచ్చుతోంది.

"పూలు ఏడవడం విన్నావా ?" అని అడిగాను.

"పూలేమిటి—మనుషులు ఏడవడం కూడా విన్నాను. ఈ మల్లెమొగ్గలు పుట్టింది స్త్రీల సిగని అలంకరించడానికేగా !"

"చెట్టునున్న పువ్వులు కొయ్యకూడదు. భగవదార్చన కోసమైనాసరే, చెట్టునున్న పువ్వులు కొయ్యకూడదు."

కారుహారన్ కుయ్ కుయ్ మని, అర్ధరాత్రివేళ కుక్క మూలిగినట్లు మూలిగిందిగాని లేకపోతే, యిలా రాత్రి భోజనాలవేళదాకా, పూల మనసుల గురించీ, కరుకు గుండెల గురించీ, ఒకరు చెప్పిన మరొకరు కాదనడమే జన్మహక్కుగా వాదించుకుని వుండేవాళ్ళం నేనూ శాంతా దేవీను. ఎవరా ఈ నీరెండ వేళ మాయింటికొచ్చారు ?—అని వీధి వాకిట్లోకి వెళ్ళను కరిగదా, సుమతి, సుమతి బావ గారూ, సుమతి అక్కగారూ, యిద్దరు పిల్లలూ—కారులో నుంచి దిగారు. అయితే, సుమతిబావగారు కారుకొన్నా డన్నమాట—అసాధ్యుడు.

"చక్కగా మీ ఫామిలీకి సరిపోయేట్టు వుంది. ఎంతకి కొన్నారు?" అని ప్రశ్నించాను. మల్లెమొగ్గలు రేకుతో టేబుల్ మీద పోసి, ఒక్క అంగలో వీధిలోకి పరిగెట్టు కొచ్చింది శాంత.

"సుమతీ, నాకు చెప్పనేలేదే—ఎప్పుడు కొన్నారు?" అంది శాంత.

సుమతి బావగారు దుర్గాన్ని చేజిక్కించుకున్న రాజ పుత్ర యోధుడిలా పోజుపెట్టాడు. ఖడ్గతిక్కన కాలంలో రణరంగానికిపోయి జాతిగౌరవం నిలపమనేవారు భార్యలు. 'నువ్వు దొంగతనం చెయ్, దొరతనం చెయ్. నాకూ, పిల్లలకీ నాలుగురాళ్ళు మిగిల్చి, ఒకయిల్లూ, ఒక కారూ, కాసిని సిల్కుచీరెలూ, అందరికీ వుండేపాటి వెండిబంగా రాలూ, పదెకరాల పల్లపుభూమీ, తీడుముకోకుండా బాంకు నిలవా సంపాయించి, అశ్రద్ధ చెయ్యకుండా యిన్సూరెన్సు ప్రీమియం కడుతూ, నలుగురిలోనూ ప్రయోజకుడి నని అని పించుకో - అంటున్నారు ఈనాటి భార్యలు. గడిచినదినాలె సుఖపూరితా లంటారా—ఏమో!'

కారులోనుంచి అందరూ పదిలంగా దిగారు. పిల్లలు ముందు దిగారు గాని, ఆపైన దిగమని మళ్ళీ ఎక్కికూచు న్నారు. సుమతీ, సుమతి అక్కగారూ శాంతతోపాటు ఇంట్లోకి నడిచారు. సుమతి బావగారు తను కొన్న కారు బాగోగులగురించి నాకు వివరించిచెప్పడం మొదలెట్టారు.

ఎంతకికొన్నారు ?—అని నేను మొట్టమొదట వేసినప్రశ్నకి సమాధానంగా, పద్ధెనిమిదివందలు అంటూ. కారు చరిత్ర చెప్పారు.

"మధ్యాహ్నం రెండుగంటల దాకా కొనడమా మానడమా అని సంశయిస్తూనే ఉన్నాను. అవతలాయన రెండు వేలకి దమ్మిడీ తగ్గనన్నాడు. కిందపెట్టగా మీదపెట్టగా పద్ధెనిమిదివందలకి పైసలయింది. చాలా పాత కారండీ. కాని, బేబీ ఆస్టిన్ బంగారం సుమండీ. ఒకవంద యిటూ అటూగా రేపుమధ్యాహ్ననికి దీనిని సొమ్ముగా మార్చేసుకో వచ్చు—కావలిస్తే!"

కారులగురించి నాకంతగా తెలీదు. మానాన్నకి కారు ఉండేదికాదు; మా ఇంట్లో ఎవరికీ కారుఉండేదికాదు. నేను కాలేజీలో చదువుకుంటున్న రోజులలో కలెక్టరుగారబ్బాయొక్కడు కాబోలు కారుమీద వచ్చేవాడు. పట్నం వచ్చాక కూడా నాకు కారులవిషయమై తెలిసింది స్వల్పమే. కొన్ని కారులకి టాపు మడవడానికి వీలయ్యేట్టు వుంటుదనీ చాలా వాటికి అలా మడిచే టాపు వుండదనీ, మడవడానికి వీలయే టాపుగల కార్లనే మనదేశపు పెళ్ళి వూరేగింపులకి ఉపయోగిస్తారనీ, రెండోరకం కార్లలో గాలిజొరదనీ, కొన్నికార్లకి బొంయ్ బొంయ్‌మనే హారనూ మరికొన్ని కార్లకి కీచుకీచుమనే హారనూ ఉంటుందనీ, కొన్ని చిన్నవిగానూ, మరి కొన్ని పెద్దవిగానూ ఉంటాయనీ, చిన్నవి ట్రాముకార్లని

గుద్దుకుంటే, పెద్దవి ఫుట్ పాత్ మీాద నుంచున్న మనుషుల్ని పలకరిస్తాయనీ—ఏవేవో యిలాంటి సర్వసామాన్య విష యాలు మాత్రమే నాకు తెలుసు; అంతకిమించి తెలీదు.

సుమతి బావగారికి డ్రయివింగ్ వచ్చు. ఆయనకి కార్ల గురించికూడా అంతో యింతో తెలుసు. ఇది తన మూడో కారట.

"చాలా పాత మోడలండీ" అన్నాడు బోనెట్ ఎత్తి చూపిస్తూ. "టైరులు సులువుగా దొరకవు. ఎక్కడన్నా ఆగిపోయినా, ఒక్కమనిషి యింటికి తోసెయ్యవచ్చు. గాలను కిన్ మైళ్ళు వస్తుంది. ఇది ఏ మేక్ అనుకుంటున్నారు. ఇంక రెండుమూడేళ్ళలో దీనికి సిల్వర్ జూబిలీజరపవచ్చు", అన్నాడు సుమతి బావగారు.

పిల్లలు కారుకి కాపలాగా కారులో కూచున్నారు. మే మిద్దరం లోపలికి వెళ్ళాము. ఆ సాయంత్రమంతా కారు గురించిన మాటలే. కారు ఉండడంవల్ల తను బిజినెస్‌ని ఎలా వృద్ధిచేసుకోగలడో చెప్పాడు సుమతి బావగారు. తనకీ, పిల్ల లకీ స్కూలుకి వెళ్ళేందుకు బస్సుబాధ తప్పిపోయింది-అంది సుమతి. నే నెక్కడికి వెళ్లాలి? రోజూ సాయంత్రం వేళ బీచికి తీసుకువెళ్తే, అదే పదివేలు—అంది సుమతి అక్కగారు. నేనూ, శాంతాదేవీ వాళ్ళ ఉత్సాహంలోనూ, ఆనందం లోనూ పాలు పంచుకుంటున్నప్పటికీ మా యిద్దరికీ ఏదో కొరతగానూ, చిక్కగానూ ఉంది. ఇరుప్వాళుల నాటిదైనా

కారనేది ఒకటి ఉండటంవల్ల, వారు మాకంటె భాగ్యవంతులూ, అదృష్టవంతులూ, మేము తక్కువవారం కాకపోయినప్పటికీ వారిలో ఏదో ఆధిక్యత సుస్పష్టమైన ముద్ర వేసుకుంది.

గంటసేపు కూచుని, లెమన్ స్క్వాష్ తాగినమీదట, వారు కుర్చీలలోనుంచి లేచారు. సాగనంపేందుకు మేము వీధిలోకి వచ్చాము. పిల్లలూ, సుమతీ వెనక సీట్లో కూచున్నారు. రెండోది తను కారు నడుపుతానని ఏడవడం మొదలెట్టింది. అంచేత సుమతి అక్కగారు ఆ పిల్లని తనవొళ్ళో కూచోపెట్టుకోవలసివచ్చింది. సుమతి బావగారు స్టీరింగ్ దగ్గిర కూచుని 'బై బై' అని విష్ చేసి, మీట నొక్కాడు. కాని, కారు ఏమీ మాట్లాడలేదు. 'బాటరీ వీక్' అని మాకు సంజాయిషీ చెబుతున్నట్టుగా అని, హాండిల్ పుచ్చుకు ముందుకి వచ్చాడు. హాండిల్ తిప్పుతున్నపుడల్లా సైలెన్సర్ మొహం మీద కొట్టుకునేది. ఒకసారి పెన్నూ, మరోకసారి కళ్ళజోడూ కింద పడ్డాయి, ఇది పనిగాదనుకొన్నాడో యేమో, రేడియేటర్ మీద బూటుకాలుతో ఒక్క తాపుతన్ని హాండిల్ తిప్పేటప్పటికి 'మొమ్మో'మని అరవడం మొదలెట్టింది కారు. సుమతి మొహమూ, సుమతి అక్కగారి మొహమూ వికసించాయి. మళ్ళీ 'బై బై' అని విష్ చేశాడు సుమతి బావగారు. ఆయన స్టీరింగ్ ముందు కూచోగానే, కారు ఒక పెద్ద దగ్గు దగ్గి, మూడడుగులు ముందుకి దూకింది. ఆయన

చెప్పనేచెప్పాడు. ఈ బేబీ ఆస్టిన్ని నడవడం మొదలెట్టా యంటే ఆగనే ఆగవు—అని. అలాగే గెంతుతూ, దగ్గుతూ కారు సందులోకి మాయమయింది.

"మనం యింతకంటె మంచికారు కొనాలండీ" అంది. శాంతాదేవి.

"మనకి కారెందుకు?" అన్నాను, కారు కావాలని అందరికీ ఉంటుంది. కాని, తాహతు ఉండొద్దూ?

"అలా అంటే ఎలా?" అని చిలిపిగా నవ్వింది.

* * * *

పట్నం బస్సులలో పొద్దుటివేళ మొహాలు ఎంత కళకళ లాడుతూ వుంటాయో, సాయంత్రంవేళ అంత దిగనాసిల్లి ఉంటాయి. అలాటి దిగనాసిల్లిన మొహంతో, చేతిలో పాండ్సు పవుడరుడబ్బా పుచ్చుకొని, అయినవీ కానివీ ఆలోచిస్తూ యింటికొస్తున్నాను. మా యింటిముందు ఒక చిన్న కారు ఆగిఉంది. ఎవరొచ్చారో అని యోచన చేస్తూ, గుమ్మందగ్గిరికి రాగానే, ఒక కాకీగుడ్డలమనిషి "గుడ్ ఈవినింగ్ సార్" అన్నాడు. సభ్యత పాటించేవాణ్ణి కనక నేనూ 'గుడ్ ఈవినింగ్' అన్నాను.

"ముకుందన్‌గారు పంపించారు సార్"

ఇంతలో శాంతాదేవి వీధిగుమ్మంలో ప్రత్యక్షమయింది-చింపిచేటంత మొహం చేసుకుని.

"ముకుందన్ ఎవరు, శాంతా!" అని అడిగాను, పాండ్స పవుడర్ డబ్బా ఆమె కందిస్తూ.

"అదేమిటండీ—ముకుందం గారండీ."

"అదే—ముకుందంగా రెవరు ?"

"సుమతి బావగారండీ."

"అలా చెప్పు. ఆయన పేరు ముకుందమా ! ఇన్నాళ్ళబట్టీ నేను తెలుసుకోనేలేదు సుమా ! ఆయన ఆ కారు అమ్మేసి ఈ కారు కొన్నట్టున్నారు-మనకీ కారెందుకు పంపించినట్టు?" అని కాకీ దుస్తుల మనిషివైపు ప్రశ్నార్థకంగా చూశాను.

"మీరొకసారి లోపలికిరండి. నేను చెబుతాను అంతా" అంటూ చెయ్యి పట్టుకు లోపలికి తీసుకువెళ్ళింది శాంత.

శాంత నాలుగురోజులక్రితం సుమతిగారింటికి వెళ్ళినప్పుడు 'చవకగా ఏదయినా కారువస్తే మాకుకూడా చెప్పండి' అందట. అందుకని ముకుందంగారు ఈ కారుని బ్రోకరుచేత పంపించారు.

"మనకి కారెందుకు, శాంతా !"

"ఆ సంగతి మనిద్దరం ప్రైవేటుగా చర్చించుకుందాం. ముందు ఆ అబ్బితో సవ్యంగా మాట్లాడి రండి."

బ్రోకరు నాకు కారు టైర్లూ, యింజనూ, హారనూ, సీటుకవర్లూ మొదలయినవి చూపించి వాటి ప్రాశస్త్యం గురించి 'పదిహేను నిముషాల టాక్' యిచ్చాడు. తర్వాత ఒక్క రవుండ్ తిప్పుకువచ్చాడు నన్ను. డిమ్ లైట్లూ, ఫోకసింగ్ లైట్లూ వేసి చూపించాడు.

"అమ్మగారిని కూడా రమ్మనమనండి, ఒక్కసారి బీచీదాకా తిప్పుకువస్తాను మిమ్మల్ని !"

"ఆ—ఎందుకు" అని గునిశాను. బ్రోకరు నా మాట వినలేదు. శాంతాదేవి యింటికి పాడిఆవు వచ్చినట్లు పదింతల ఆనందం కనబరచసాగింది. ఒక్కసారి బీచి ఈ చివరనుంచి ఆ చివరదాకా దర్జాగా కారులో తిరిగివచ్చాము.

♦ ♦ ♦

"మీకు తెలీదు ఊరుకోండి. పట్నంలో ఉన్నామన్న మాటేగాని, సాయంత్రంపూట సరదాగా ఎక్కడికయినా వెళ్ళడముందా, ఏమన్నానా ? కారు ఉంటే మీ గౌరవం ఎంత పెరుగుతుంది. క్యూల్లో నుంచోడము, బస్సుల్లోని చెమటవాసనా తప్పుతుంది. మనకీ ఒక కారు ఉండాలి."

"నిజమే. రెండువేల రెండొందలు ఎక్కడనుంచి వస్తాయి ?"

"బాంకులో పన్నెండు వందల పైచిల్కువుంది. ఈ నాలుగు పేటల బంగారపు గొలుసు నేను మొయ్యలేకుండా వున్నాను. ఇది అమ్మేసెయ్యండి. ఇంకా వందో, రెండొందలో కావలసివస్తే, ముకుందంగారు సర్దుతారు. వాళ్ళ కారు పద్దెనిమిది వందలని చెప్పారా—వాళ్ళు చివరికి యిచ్చినది పదిహేను వందలేనట. ఇదయినా రెండువేలలోపే ఉంటుంది గాని, రెండువేలకిపైన ఉండదు. రెండువేలు దాటకూడదని నేను ఆయనకి చెప్పనే చెప్పాను. ఏదో కమీషన్ డబ్బుల కోసమని బ్రోకరు మరి కాస్త ధర చెప్పి ఉంటాడు."

“మనకీ ఒక కారు ఉండాలంటావు?” అన్నాను, వోటమిని హోమోపతి మాత్రలా మింగుతూ.

“ఆహా, ఉండాల్సిందే.”

♦ ♦ ♦

మాకూ ఒక కారంటూ ఏర్పడింది. ఇంటిముందు కాస్త స్థలంఉంది కాబట్టి గరాజ్ బాధ తప్పింది. మేము కొన్నది 1935 నాటి మారిస్. ముకుందంగారిది యిరవైలనాటి ఆస్టిన్ అయితే, మాది ముప్ఫయిలనాటి మారిస్.

ఆవుకి దూడలా కారుకి డ్రయివరు ఉండాల్సిందే. ఎప్పుడు అక్కర్లేకపోయినా, నాకు డ్రయివింగ్ చేతనై, నేను డ్రయివింగ్ లైసెన్సు పుచ్చుకునే దాకా అయినా, డ్రయివరంటూ ఒకడు ఉండాలి. మూడు రోజుల్లో డ్రయివింగ్ నేర్పి, నాలుగోనాడు లైసెన్సు తీసియిస్తానన్నారు ముకుందంగారు. పెద్దమనుష్యుల్ని యిబ్బంది పెట్టడం భావ్యం కాదనీ, ఒక నెల్లాళ్ళపాటు డ్రయివర్ని పెట్టుకోడం మంచిదనీ శాంతాదేవి తీర్మానించింది.

ఆమె నాలుగు పేటల గొలుసూ అమ్మకుండానే కారు కొన్నాం. ఎటొచ్చీ ఆ గొలుసు బాంకులో తాకట్టు పెట్టాం. ముకుందంగారిని అడగటం బావుండదని మా ఆఫీసులో అప్పు పెట్టాను. నెలకి నలభై రూపాయిల జీతంమీద ఒక మలయాళీ డ్రయివరుని ముకుందంగారే కుదిర్చారు. ఈ కారు కొనడంలో ఆయన చేసిన సహాయం మేము ఎన్నటికీ మర్చి

పోలేము. నేను కారు కొన్నానని తెలిసి మా ఆఫీసు మేనేజరు నా ప్రయోజకత్వానికి నన్ను కంగ్రాట్యులేట్ చేశాడు.

నెల్లాళ్ళలో యిద్దరమూ నేనూ, శాంతాదేవీ కూడా, డ్రయివింగ్ నేర్చుకోవాలని నిశ్చయించుకున్నాము. కారు కొన్న నాలుగోరోజున స్టీరింగ్ చక్రంమీద నేను చెయ్యి వేసీ వెయ్యగానే ఏదో కొత్త బలం వచ్చింది నాలో. ఈ లోహ జంతువు నా బానిస, నేను చెప్పినట్టు నడుచుకుంటుంది—అనే అహం కలిగింది. మొదటిగేరు ఎప్పుడు వెయ్యాలో, మొదటి గేరులోనుంచి రెండోగేరులోకి మార్చుకునేటప్పుడు క్లచ్ నొక్కకపోతే గేరుబాక్సు ఎలా పాడైపోతుందో, క్లచ్ నొక్కేటప్పుడు యాక్సిలరేటర్ మీద పాదం ఎందుకు తీసెయ్యాలో, బండిని న్యూట్రల్ చెయ్యనిదే బ్రేకు ఎందుకు వెయ్యకూడదో మొదలైన మోటారింగ్ పాఠాలన్నిటిలోనూ తర్ఫీదుపొంది నెల తిరక్కుండా లైసెన్సు పుచ్చుకున్నాను. నాకు లైసెన్సు యిప్పించడంలో కూడా ముకుందంగారు ఎంతో సాయంచేశారు. ప్లాను ప్రకారం నెలాఖరుకి డ్రయివర్ని తీసేశాము.

నేనయితే డ్రయివరు సరసని కూచుని డ్రయివింగ్ నేర్చుకున్నాను. శాంతాదేవి అలా కూచుంటుందా? కారు వెనకసీట్లో కూచుని డ్రయివరు బట్టలు గబ్బు వాసన కొడుతున్నాయనే మనిషి. అతని సరసని కూచుని డ్రయివింగ్

నేర్చుకుంటుందా? "లైసెన్సు పుచ్చుకున్నాక మీరు నేర్పుదురు గాని!" అని మెత్తబడింది శాంతాదేవి.

కొన్న తర్వాత రెండు నెలల వరకూ, మా కారు మంచి పిల్లలా ప్రవర్తించింది. ఇన్నాళ్ళ బట్టీ మేము కారు ఎందుకు కొనుక్కో లేదా అని విచారించాము. మాకు తెలిసినవాళ్ళందరి యిళ్ళకూ కారులో వెళ్ళి పల్కరించి వచ్చాము. లిమొజైన్సపక్క మా కారు పిట్టలా కనిపించి నప్పటికీ, ట్రాఫిక్ కానిస్టేబుల్ సూచనల్ని అది అప్పుడప్పుడు నిర్లక్ష్యం చేసి రెండడుగులు ముందుకి వేస్తున్నప్పటికీ, ఒక్కొక్క ఉదయం స్టార్ట్ అవడానికి మొండికెత్తి తలాయిస్తున్నప్పటికీ కాకిబిడ్డ కాకికిముద్దు అన్నట్టు, మా కారు మాకు ముచ్చటగా కనిపించేది. ఇలా ప్రాణాలతో సమానంగా చూసుకునే మా ముద్దు బిడ్డకి రెండు నెలల అనంతరం ఒక గడ్డువ్యాధి పట్టుకుంది.

ఆవేళ మంగళవార మనుకుంటాను. ఆఫీసులో చాలా పని ఉంది కూడా ఆ రోజున. భోజనంచేసి, టైగియ్ కట్టుకొని, 9-45 కి కారుని పల్కరించాను. ఏదో పక్షవాత మొచ్చినట్లు కదలలేదు. రిక్షావాళ్ళని పిలిచి తోయించాను. ప్లగ్గులు తుడిచాను, బాటరీ కుదిపాను, మె. సి. పంపు పరీక్ష చేశాను. రిక్షావాళ్ళచేత ఈ చివరినుంచి ఆ చివరికి రెండుసార్లు తోయించాను మా వీధిలో. కాని అది చెప్పిన మాట వింటేనా? పదకొండుం బావు అయింది. వీధి గుమ్మంలో ఎండలో నుంచున్న శాంతాదేవి అలానే

నుంచుంది. నా జుట్టంతా రేగిపోయింది. తెల్లపంట్లాముమీద రెండు ఆయిల్ మరకలు పడ్డాయి; మొహం అంతా చెమటలు కారుతోంది. వీధిలో వాళ్ళు కొందరు నన్ను తమాషాగా చూడటం గమనించి, శాంతాదేవి నన్ను లోపలికి పిలిచి ఆ ప్రయత్నం అక్కడితో విరమించి ఆఫీసుకి వెళ్ళమంది. పదకొండున్నరకి ఆఫీసుకి ఏమి వెళ్తాను ? 'యిన్ డిస్ పోస్డు' అని మర్నాడు అబద్ధం చెప్పడానికి నిశ్చయించుకున్నాడు.

మనిషికి జబ్బుచేస్తే వైద్యుడు కావాలి: కారుకి జబ్బుచేస్తే మెకానిక్ కావాలి. మా యింటికి రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న మెకానిక్‌ని పిలుచుకొచ్చాను. డాక్టరు స్టెతస్కోపూ, మెడిసిన్ ఛెస్టూ తీసుకొచ్చినట్టే యితను ఒక సుత్తీ, రెంచీలపొట్లమూ పట్టుకొచ్చాడు. అరగంట పరీక్షచేసి, యింజన్ సరైన కండీషన్‌లో లేదనీ, పిస్టన్ రింగ్స్ మార్చాలనీ, వైరింగ్ సరిగా లేనికారణాన బాటరీ డవున్ అయిందనీ విన్నవించాడు. కొత్త బాటరీ నూరు రూపాయ లవుతుంది. ఈ బాటరీలోని సెల్సుగాని మాడిపోకపోతే యిదే ఛార్జీ చెయ్యవచ్చు. ఏమయితేనేం రెండు గంటలు బేరం చేసినమీదట 200 రూపాయలకి మా కారుని కొత్తకారుగా చేసి యిస్తానన్నాడు. వారంరోజులపని. బాటరీ మాత్రం (యిప్పుడున్నది పాడైతే సుమండీ !) మేము కొనుక్కోవాలి. ఈ వొప్పందం అయిపోయినతర్వాత కారు తన మనుషులచేత తోయించుకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం సుమతిగారింటికి వెళ్ళి మాకు సంభవించిన కష్టం చెప్పుకున్నాం. వాళ్ళ కారూ పేచీపెడుతోందనీ, బావ అమ్మేద్దామని అనుకుంటున్నాడనీ సుమతి సన్నగా చెప్పింది. మనుషులకే కాలునొప్పీ కడుపునొప్పీ రాగాలేనిది, యంత్రాలకి రావా—అని మేము వాళ్ళకి ధైర్యం చెప్పి వచ్చాము.

వారం రోజులపని—అని నమ్మించిన మెకానిక్ ఆ పనికి నెలా వారంరోజులు తీసుకున్నాడు. ఇంజను దించానన్నాడు; బిగించానన్నాడు. బ్రేకు లింక చెప్పినట్టు వింటాయన్నాడు. ఎన్నెన్నో మాయమాటలు చెప్పాడు. అతని రెండువందల బిల్లూ తమాషాగా నాలుగువందలు అయింది. బాటరీ కొత్తది కొనుక్కున్నాం. మొత్తం దాని మొహాన అయిదు వందలు పోశామన్నమాట.

మెకానిక్ రెండేళ్ళ గారంటీ యిచ్చాడు గనక, అయిదు వందలు అయినా సరేలే అనుకున్నాం. మెకానిక్ దగ్గర్నుంచి వచ్చిన మూడోరోజున పూనమల్లి హైరోడ్డుమీద పోతూ పోతూవున్న కారు ఠఫీమని ఆగిపోయింది. ముందుకి రాదు, వెనక్కి వెళ్ళదు. చక్రాలు తిరగవు. దాని ధర్మమా అని రోడ్డుకి ఒక పక్కగా ఆగింది నా అదృష్టం బావుండి, ఆ క్షణాన శాంతాదేవి కారులో లేదు. నేను మెకానిక్ దగ్గిరికిపోయి ఈ అవస్థ చెప్పుకున్నాను. ఇలాంటి ప్రతిష్టంభనలు తనకి నిత్యానుభవమే నన్నట్లు సుత్తీ రెంచీలూ పుచ్చుకు సీనుమీదికి వచ్చి, నన్ను యింటికి పొమ్మన్నాడు.

'ఏం?' అన్నాను.

"రెండుగంట లవుతుంది దీన్ని కదిపేందుకు, యూనివర్సల్ జాయింట్ దగ్గిరనుంచీ విప్పుకురావాలి. మీరు యింట్లోనే ఉంటారుగా! ఇంటికి తీసుకువచ్చి వొప్పజెబుతాను."

ఇంటికి వెళ్ళి సంగతంతా శాంతాదేవి చెవిని వేశాను.

"రెండేళ్ళు గారంటీ యిచ్చాడుగా మెకానిక్!"

"అతను మంచివాడిలాగానే కనిపిస్తాడు. నేను వెళ్ళగానే చేస్తున్న పని వొదిలేసి నా వెంట వచ్చాడు."

"ఏమి మంచీ, గడమంచి!" అని పెదవి విరిచింది శాంతాదేవి.

మధ్యాహ్నం మూడుంబావుకి భుంయ్ భుంయ్‌మంటూ కారు యింటిముందుకి వచ్చి ఆగింది. తప్పిపోయిన గొడ్డు దొరికినంత సంతోషమయింది మాకు. ఆ సాయంత్రం శాంతాదేవికి ఏదో పేరంటం ఉంది; పరువు దక్కించింది మా కారు.

ఒకవారం రోజులు బాగానే పనిచేసింది. ఇంతలో వెనక టైర్లు రెండూ పేలిపోయాయి. చచ్చి చెడి అవి రిప్లేస్ చేశాం. రేడియేటర్ కారడం మొదలెట్టింది. దానికి మాటు వేయించాం; పెట్రోల్ పైప్ లీక్ అవడం మొదలెట్టింది—దాన్ని అతికించాం. బ్రేకులు చెప్పనే అక్కర్లేదు—వారానికొక సారి రిపేరు చేయించవలసి వచ్చేది. ఒకసారి రోడ్డు రోలరుని

ఢీకొనేటంత పని అయింది. పులిమీద పుట్రలా ఒక సాయంత్రం గీరుబాక్సు చెడిపోయింది.

"కొత్త గీరుబాక్సు వేసుకుంటే సరి. రెండొందలకంటె ఎక్కువ అవదు." అన్నాడు మెకానిక్.

శాంతాదేవి కల్పించుకొని. 'ఇంక దమ్మిడీ దీనిమీద ఖర్చుపెట్టేందుకు వీలులేదు. కారు ఉండని ప్రాణానికిపోయా, ఏమన్నానా? వెధవకారు. మీరు చిక్కి సగమయారు. ఈ రాక్షసిని ఎవరి మొహానయినా తగలెయ్యండి' అంది భీకరంగా.

"ఎంత ధర పలుకుతుంది ఈ కారుకి?" అని అడిగాను మెకానిక్‌ని.

"దీన్ని యిప్పుడు ఎవరుకొంటారు సార్? రెండొందలు పెట్టి గీర్ బాక్సు బాగుచేయించి......" మెకానిక్ వాక్యం పూర్తి చెయ్యకుండానే, శాంతాదేవికి జడిసి, జారుకున్నాడు.

కారు అమ్మకం గురించి ఆ సాయంత్రం ముకుందం గారితో సంప్రదించాను. ఆయనా నాకు మల్లేనే అయిదారొందలు తగలేశాడట. కాయకల్ప చికిత్సవల్లకూడా ముసిలివాళ్ళు యువకులుగా మారరు—అన్నాడు పయిగా.

బ్రోకర్ల ద్వారా మా కార్లు అమ్ముడుబోవు. వేలంలోనయినా ఈ పెంట విరగడవుతుందేమోనని చూస్తున్నాం.